# జున్ను దొంగ

మా ప్రసాదు ఒట్టి చిలిపివాడు. వాడు చేయని అల్లరి అంటూ లేదు. ఆయిదోఏడు వచ్చింది. అల్లరి మాత్రం ఏమీ తగ్గలేదు,

వాడికి జున్ను అంటే తగని యిష్టం. కనీసం విరుగుడు పాలన్నాగూడా వాడికి చాలాయిష్టం. రోజూ ప్రొద్దున్నా సాయంత్రం మాఅమ్మ పాలు కాచి చల్లార్చి కాస్త పంచదార వేసి నాకూ వాడికి యిస్తుంది. ఒకరోజున వాడు అమ్మని యిట్లా అడిగాడు. "అమ్మా అందరూ పాలలో పంచదార, మజ్జిగలో ఉప్పు వేసుకుంటారు. ఎందుకని? పాలల్లో ఉప్పు, మజ్జిగలో పంచదార ఎందుకు వేసుకు త్రాగకూడదు?"

"పాలలో ఉప్పువేస్తే విరిగిపోతాయి. మజ్జిగలో పంచదార వేసుకుంటే జబ్బుచేస్తుంది" అని అమ్మ చెప్పింది.

కొన్ని రోజులకి ఒకనాడు మా ప్రసాదుపంటపండింది. ఆరోజున మా అమ్మమ్మ జున్ను పాలు తీసుకువచ్చింది. మావాడు జున్ను కావలసినంత తిన్నాడు. ఆరోజు వాడికి కొండెక్కినంత పనయింది.

మర్నాడుగూడా వాడికి జున్ను తినాలనిపించింది. అమ్మని జున్ను పెట్టమని అడిగాడు.

"ఇప్పుడెక్కడనించి వస్తుందిరా వెధవా" అని అమ్మ చివాట్లు పెట్టింది.

పాపం బిక్కమొగంపెట్టి వెళ్లిపోయి దీర్ఘంగా ఆలోచించాడు. చివరకు ఒక నిర్ణయానికి వచ్చాడు. "జున్ను ఎట్లాగో సంపాదించలేం కాబట్టి పాలలో కాస్త ఉప్పురాయి వేస్తే చప్పగా విరిగిపోతాయి. ఆ విరిగినపాలలో కాస్త బెల్లంగడ్డ వేసుకుంటే చక్కగా జున్ను తిన్నట్లే ఉంటుంది."

పి. ప్రేమకుమారి

మా అమ్మ ప్రతిరోజూ మధ్యాహ్నంపూట పొయ్యిమీద పాలు పెట్టి నిద్రపోతూ ఉంటుంది. అమ్మ లేచిన తర్వాత ఆ పాలలో కాసిని కాఫీకి కలిపి మిగిలిన పాలు తోడు పెడుతుంది. అందువల్ల మావాడికి చక్కటి అవకాశం దొరికింది, జున్ను తినటానికి.

మధ్యాహ్నం అమ్మ నిద్రపోతుంటే, నెమ్మదిగా వెళ్ళి కాస్తఉప్పు తీసుకొని చల్లగా ఆ కాగే పాల కుండలోవేసి, మెల్లగా యింట్లోకి వెళ్ళి ఏమీ ఎరుగనివాడిలా పడుకున్నాడు.

అమ్మ లేచిన తర్వాత కాఫీలో పాలు కలుపుదామని పాలు చూచేటప్పటికి విరిగి గడ్డలయిపోయి ఉన్నాయి. ఏమిటా ఈరోజుపాలు కాస్తా విరిగిపోయాయని ఆలోచించి, అందులో కాస్త బెల్లంవేసి "ఒరే ప్రసాదూ! నిన్న జున్ను కావాలన్నావుకదూ! అందుకని నీకోసం తెప్పించాను" అని నవ్వుతూ వాడికి కాస్త పెట్టింది. ఇలా జరుగుతుందని వాడికిముందే తెలుసు. సంతోషంతో హాయిగా ఆ బెల్లం కలిపిన కాస్త విరుగుడూ నోట్లో వేసుకున్నాడు. ఇక ఆ రోజునుండి చూడండి! మా యింట్లో పాలు విరగని రోజంటూ లేదు. మావాడు విరుగుడుతినని రోజంటూ లేదు.

మా అమ్మకూ నాన్నకూ ఇదో పెద్ద సమస్య అయిపోయింది. "ఎందుకీ పాలు విరిగిపోతున్నాయి?" అని వారు ప్రతి వాళ్ళను అడిగిచూచేరు. కాని ఎవరూ దానికితగిన, సమాధానమివ్వలేదు. చివరకు అమ్మ ఒక సోదిఅమ్మని పిలిచి సోది అడిగింది. ఆ అమ్మి సోదిలోకి మా నాయనమ్మ వచ్చినట్లూ, ఆమె పేరుతో ముత్తయిదువకు, చీరె, రెవికలగుడ్డ, పసుపు, కుంకుమ, యిచ్చి పెట్టుకుంటే పాలు విరగటం మానుతుందనీ చెప్పింది. అలా చేయకపోతే యింకా విపత్తులు కూడా వస్తాయని చెప్పింది. ఇక మా అమ్మ ఆగకుండా నాన్నగారిని వేధించి చీరె, రెవికలగుడ్డా తెప్పించి మా పిన్నిని పిల్చి ముత్తయిదువకు పెట్టుకొని అవి యిచ్చింది.

ముత్తయిదువకు చీరె, రవికెల గుడ్డ, ముట్టినప్పటికీ పాలు విరగడం మాత్రం మానలేదు. మా నాన్న గారు మాత్రం "ఈ కరువురోజుల్లో ముత్తయిదువ కంటూ పదిరూపాయలు వదిలించావు" అని విసుక్కున్నారు మా అమ్మమీద.

తరువాత కొన్ని రోజులకు మా అమ్మమ్మ వచ్చింది. అమ్మ, అమ్మమ్మతో యిలా పాలు రోజూ విరిగిపోతున్నాయని చెప్పగానే, "అదేముందే! గంగానమ్మకు చద్ది నైవేద్యం పెట్టుకుంటే, పాలు విరిగిపోవటం టకీమని కట్టిపోతుంది" అని చెప్పింది.

మా అమ్మ చాలా శ్రద్ధగా గంగానమ్మతల్లికి పూజచేసి చద్ది నైవేద్యం పెట్టింది. కాని పాలు మాత్రం విరగటం మానలేదు. చల్లనితల్లి గంగానమ్మకూడా పాలు విరిగిపోవడం మాన్పలేక పోయింది.

ఇట్లా కొన్నిరోజులు జరిగాయి. ఒకరోజు మా ప్రసాదు పాలలో ఉప్పువేయటంకోసం వెళ్ళడం మా చిన్నచెల్లాయి వనజ చూసింది. దానికి మూడేళ్ళు. దానికి మీగడఅంటే చాలా యిష్టం. వాడు దొంగతనంగా మీగడ తిని వెళ్ళిపోతున్నాడేమో ననే ఉద్దేశ్యంతో, తాను వెళ్ళి మీగడ తీద్దామని ఆ కాగుతున్న పాలల్లో చెయ్యిపెట్టింది. చెయ్యి పాలల్లో పెట్టీ పెట్టడంతోనే చుర్రుమని కాలింది. 'చుర్రు' మనగానే "అమ్మో" అంటూ కేకపెట్టి ఏడవడం మొదలుపెట్టింది. ఇంతలో అమ్మా, నాన్నా పరుగెత్తుతూ వచ్చి చూసేటప్పటికి, దాని చెయ్యి కాస్తా ఎర్రగా కాలివుంది. అది చెయ్యి విదిలించుకొంటూ ఏడుస్తోంది. దాని చెయ్యికి మందురాసి "పాలల్లో ఎందుకు చేతులు పెట్టావే" అని అడిగిందిఅమ్మ.



అమ్మ లేచిన తర్వాత కాఫీలో పాలు కలుపుదామని పాలు చూచేటప్పటికి అవి విరిగి గడ్డలయి పోయిఉన్నాయి.

"అన్నయ్య మీగడ తినటానికి వెళ్ళి తీసుకుని వెళ్ళిపోయాడు, అందుకని నేనుకూడా తిందామని చెయ్యి పెట్టేటప్పటికి చుర్రుమని కాలింది" అని చెప్పింది ఏడుస్తూ.

అప్పుడు అమ్మ చూచేటప్పటికి పాలు విరిగి గడ్డలయిఉన్నాయి. అప్పుడు మా ప్రసాదును పిలిచి "ఏమివేశావురా పాలల్లో" అని అడిగింది మా అమ్మ. బిక్కమొగంపెట్టి వాడు జరిగిందంతా అమ్మకు చెప్పాడు. అలాఎప్పుడూ చేయకూడదని నాలుగు చివాట్లు పెట్టి ఊరుకున్నారు.

ఆ రోజున మా అమ్మ నాన్నా, "పాపకు చేయికాలితే కాలింది కాని గంగానమ్మ తల్లికూడా పట్టుకోలేని విరుగుడుపాల దొంగను మాత్రం అయిదు నిముషాల్లో పట్టుకుంది" అని నవ్వుకున్నారు.

ఆ రోజునుంచి ఎప్పుడయినా పాలు నిజంగా విరగాల్సి విరిగిపోయినా కూడా, పాపం మా ప్రసాద్ ఏదోవేసి విరుగకొట్టాడని అనేవారు. ★